సాక్షి పెద్దపల్లి

గురువారం । 14 । డిసెంబర్ । 2023



క్రిస్మస్ క్యారల్స్ ప్రారంభం

మంథని: గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ క్యారల్స్ ప్రారంభించారు. క్రిస్మస్ పర్వ దినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు.



మల్లన్నకు పట్నాలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. వేలాది మంది భక్తులు పట్నాలు వేసి పూజలు చేశారు.



వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్కూళ్లలో 'లంచ్, లర్న్'



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులకు అందుతున్న బోధన తీరు, పద్ధతులు, భోజన వసతి పరిశీలించేందుకు ఇకనుంచి ప్రతీ బుధవారం లంచ్ అండ్ లర్న్ కార్యక్రమం అమలు చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పట్టణ శివారు రంగంపల్లిలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం లంచ్ అండ్ లర్న్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థినులతో కలిసి క్యూ పద్ధతి పాటించి సహపంక్తి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందని ప్రశంసించారు. అంతకు ముందు కలెక్టర్ బాలికలతో మాట్లాడి, వారి అభిరుచులు, లక్ష్యం తదితర వివరాలపై ఆరా తీశారు. ఇక నుంచి ప్రతి బుధవారం జిల్లా అధికారులు సందర్శించి ఆహార నాణ్యత, విద్యా ప్రమాణాలపై తనకు నివేదిక సమర్పిస్తారని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం చేయాలని సూచించారు. చదువుతో పాటు ఆటల్లోనూ పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలి



భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం అమలు తీరు, నాణ్యతపై ప్రతీ బుధవారం తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మీడియంలో గణితం, ఇంగ్లిష్ మీడియంలో సామాన్యశాస్త్రం సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యార్థులు కలక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఆమె పర్యటించారు. అసంపూర్తిగా ఉన్న టాయిలెట్స్ నిర్మాణాలను సత్వరమే పూర్తిచేయిస్తానన్నారు. రెండు రోజుల్లా వాటర్‌ప్లాంట్ ట్యాంక్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఆదేశిస్తానని తెలిపారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులను తొలగించేందుకు అనుమతులు జారీచేస్తానని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర శారద, నగర పాలక కమిషనర్ కె.నాగేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అతిథిగృహ నిర్మాణం వేగవంతం



ప్రగతి దశలో పనులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో చేపట్టిన గెస్ట్‌హౌస్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం కునారం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ జిన్నా శ్రీనివాస్‌రెడ్డి తన సొంత డబ్బులు రూ30లక్షల వ్యయంతో అతిథిగృహం నిర్మిస్తున్నారు. మల్లికార్జునస్వామి దర్శనం కోసం వచ్చే వీఐపీలు, ప్రజాప్రతినిధుల విడిది కోసం దీనిని వినియోగిస్తారు. రెండు అంతస్తుల్లో భవనం నిర్మిస్తున్నారు.

పత్తి ధర రూ.6,712

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం పత్తి క్వింటాలు గరిష్ట ధర రూ.6712గా నమోదైంది. కనిష్ట ధర రూ.5,811 కాగా, సరాసరి ధర రూ.6,677గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

రామగుండం: విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం యువత దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) హెచ్‌ఆర్ మేనేజర్ శ్రావణి సూచించారు. ఇందుకోసం గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలండ్, రొమేనియా, యూకేలో ప్రభుత్వ, ప్రైవేట్ ఏజెన్సీలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. జపాన్‌లోని ఆస్పత్రుల్లో ఉద్యోగాల కోసం హోటల్ మేనేజర్‌మెంట్‌లో డిప్లొమా, డిగ్రీ, హోటల్ పరిశ్రమలో అనుభవం ఉండి, 22–27ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులన్నారు. తొలుత జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యంపై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తిగలవారు 91007 98204, 78935 66493, 98496 39539 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెట్టిందే తినాలి..!

- నిర్వాహకులు అమలు చేసేదే మెనూ
- విధివిధానాలు వెలువడక.. బిల్లులు రాక
- సర్కారు బడుల్లో అస్తవ్యస్తంగా 'అల్పాహారం'



వీరు ముత్తారం జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులు. ఉదయం అల్పాహారం తింటున్నారు. ఇందులోని 96 మందికి ఒకరోజు ఉప్మా, మరోరోజు గుడాలు, ఇంకోరోజు అటుకులను అల్పాహారంగా అందిస్తున్నారు. మెనూ ప్రకారం ఇడ్లీ, దోశ, పూరీ పెట్టడం లేదు. వంటసామగ్రి సమకూర్చితే ఆ టిఫిన్ అందిస్తామని వంట నిర్వాహకులు చెబుతున్నారు.



ఇది జిల్లాకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్. ఇందులోనే ప్రైమరీ స్కూల్ ఉంది. జెడ్పీ హైస్కూల్‌లోని 435 మంది, ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు ఇందులో రోజూ ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విధివిధానాలేమీ రూపొందించలేదు. తమకు తోచినట్లు ఓ రోజు ఉప్మా, మరోరోజు అటుకులు, ఇంకోరోజు పేలాలను విద్యార్థులకు అందిస్తున్నారు మధ్యాహ్న భోజన నిర్వాహకులు.

సాక్షి, పెద్దపల్లి: ఆకలి కడుపులతో ఉదయమే హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల కోసం సర్కారు అమలు చేస్తున్న సీఎం అల్పాహార పథకం అస్తవ్యస్తంగా తయారైంది. తొలుత జిల్లాలోని ప్రతీ మండల కేంద్రంలోని ఒక ప్రాథమిక పాఠశాల, మరో హైస్కూల్‌ను ఎంపికచేసింది. కానీ, విధివిధానాలేమీ వెలువడకపోవడంతో రెండు నెలలుగా ఈ పథకం మొక్కుబడిగా సాగుతోంది. ఈలోగా ప్రభుత్వం మారడం, పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాకపోవడంతో అమలు తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బిల్లులు రాక..
మెనూ అమలుకు నోచుకోక..

- జిల్లాలో 547 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో 30,972 మంది విద్యార్థులు ఉన్నారు.
- ఇందులో ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు.
- ఖాళీ కడుపులతో పాఠశాలలకు హాజరయ్యే పేద విద్యార్థుల కోసం అల్పాహార పథకం తీసుకొచ్చింది.
- అయితే, పెరిగిన ధరలతో తమకు గిట్టుబాటు కావడం లేదని, ఐదు నెలలుగా బిల్లులు విడుదల కావడం లేదని నిర్వాహకులు వాపోతున్న నిర్వాహకులు తమకు తోచిన టిఫిన్ పెడుతున్నారు.
- మరోవైపు.. అల్పాహారం తయారీకి కావాల్సిన సరుకులు, ఒక్కో విద్యార్థికి కేటాయించే సొమ్ము గురించిన సమాచారంపై అధికారులు ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు.
- దీంతో పథకం అమలవుతున్న పాఠశాలల్లో మెనూ పాటించకుండా కేవలం ఉప్మా, గుడాలతో నెట్టుకొస్తున్నారు.
- ఇదే విషయమై డీఈవోను వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాలేదని పేర్కొన్నారు.
- పాఠశాలల్లో అల్పాహార పథకం మెనూ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

సీఎం అల్పాహార పథకం మెనూ ఇలా..

సోమవారం: ఇడ్లీ, సాంబారు లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ
మంగళవారం : పూరీ, ఆలుకుర్మా లేదా రవ్వ, సాంబారుతో కూడిన టమాట బాత్
బుధవారం : ఉప్మా, సాంబారు లేదా రైస్, రవ్వ కిచిడీ, చట్నీ
గురువారం : మిల్లెట్ ఇడ్లీ, సాంబారు లేదా పొంగల్, సాంబారు
శుక్రవారం : ఉగ్గాని, పోహా, మిల్లెట్ ఇడ్లీ, చట్నీ లేదా గోధుమ రవ్వ కిచిడీ, చట్నీ
శనివారం : పొంగల్, సాంబారు లేదా వెజిటేబుల్ పులావ్, రైత, ఆలుకుర్మా

అప్పల భారం భరించలేం



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన బిల్లులే రావడం లేదు. దీనికితోడు అల్పాహారం అందించే బాధ్యత మాకే అప్పగించడంతో అప్పు చేసి పిల్లలకు పెడుతున్నాం. ఇక ఈ భారం మోయలేక పోతున్నం. పెండింగ్ బిల్లులు ఇవ్వాలె. విధివిధానాలు విడుదల చేయాలె.

– కొంతం భాగ్య, వంట కార్మికురాలు, పెద్దపల్లి

బిల్లులు రావడం లేదు



విద్యార్థులకు కొన్నేళ్లుగా మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న. ఐదు నెలల నుంచి డబ్బులు రావడం లేదు. కూరగాయల రేట్లు పెరిగినయి. అక్కడా ఇక్కడా అప్పుతెచ్చి పిల్లలకు భోజనం పెడుతున్నం. వారంపాటు పిల్లలకు టిఫిన్ పెట్టినం. కానీ, మధ్యాహ్న భోజన బిల్లులే రాలే. అల్పాహార పథకం కొనసాగించడం ఎట్లా?

– గద్దం లక్ష్మి, వంట నిర్వాహకురాలు, గోదావరిఖని

ఆహ్లాదం.. అభివృద్ధి

- పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్ రోడ్లు
- జిల్లా కేంద్రంలో బస్ డిపో ఏర్పాటు
- చివరి ఆయకట్టుకు సాగునీరు
- ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ సాధిస్తా
- విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతా
- 'సాక్షి'తో ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లిరూరల్: 'పెద్ద'పల్లి నియోజకవర్గాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తాం.. ఇందుకోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతాం.. అనూహ్యంగా జిల్లా కేంద్రంగా అవతరించిన పట్టణ రూపురేఖలు మార్చుతాం.. హోదాకు తగినవిధంగా తీర్చిదిద్దుతాం.. హైదరాబాద్–కరీంనగర్– రామగుండం రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీని అధిగమించేందుకు పెద్దపల్లి, సుల్తానాబాద్ శివారుల్లో బైపాస్ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తాం.. దాదాపు మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ప్రజా, రైతు సమస్యలపై పోరు చేస్తూ నిత్యం ప్రజల మధ్యే ఉన్నాం.. ఇప్పుడు కూడా ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటాం' అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బుధవారం ఆయన 'సాక్షి' జరిపిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

సాక్షి: పెద్దపల్లి ప్రగతి కోసం ఏం చేస్తారు?

ఎమ్మెల్యే: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పెద్దపల్లి ఏడేళ్ల క్రితం అనూహ్యంగా జిల్లా కేంద్రంగా అవతరించింది. అందుకు తగినవిధంగా అభివృద్ధికి నోచుకోలేదు. హోదాకు తగ్గట్టు అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం. సుల్తానాబాద్ మున్సిపాలిటీపైనా శ్రద్ధ చూపుతాం.

సాక్షి: రాజీవ్ రహదారిపై పెరిగిన వాహనాల రద్దీని ఎలా నియంత్రిస్తారు?

ఎమ్మెల్యే: హైదరాబాద్–కరీంనగర్– రామగుండం మధ్య రాజీవ్ రహదారిపై పెద్దపల్లిలో ట్రాఫిక్ సమస్య పెరిగింది. రద్దీని నియంత్రించేందుకు పెద్దపల్లి, సుల్తానాబాద్‌ల్లో బైపాస్ రోడ్లు నిర్మిస్తాం. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విన్నవిస్తాం.

సాక్షి: ఆర్టీసీ బస్‌డిపో సంగతి ఏమిటి?

ఎమ్మెల్యే: పెద్దపల్లిలో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు ప్రజల చిరకాలవాంఛ. బస్‌డిపో కచ్చితంగా ఏర్పాటు చేయిస్తాం.

సాక్షి: వ్యసాయ భూములకు సాగు నీరు సంగతేమిటి?

ఎమ్మెల్యే: నియోజకవర్గంలో శ్రీరాంసాగర్ డి–83, డి–86 కాలువల ద్వారా ఇప్పటికే సాగునీరు అందుతోంది. అయితే, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దఫాలో ఆ భూములకు సైతం సాగునీరు అందిస్తాం.

సాక్షి: విద్య, వైద్య సేవలను ఎలా మెరుగుపర్చుతారు?

ఎమ్మెల్యే: ప్రజలకు విద్య, వైద్య సేవలు ఆశించిన స్థాయిలో అందడంలేదు. గత పాలనలో కుంటుపడ్డ సేవలను గాడిలో పెట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం. పెద్దపల్లిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందేలా చూస్తాం. పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: పెద్దపల్లి పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందించేదెలా?

ఎమ్మెల్యే: ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఆహ్లాదం పంచేలా పట్టణంలో పార్కులను అందుబాటులోకి తీసుకొస్తాం. ఇప్పటికే ఉన్నవాటిని అభివృద్ధి చేస్తాం. పిల్లలకు ఆటవస్తువులు తెప్పిస్తాం. పచ్చదనం పెంపొందిస్తాం. పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో ప్రస్తుతం ఉన్నవాటితోపాటు స్థల లభ్యతను బట్టి మరిన్ని ఉద్యానవనాలు ఏర్పాటు చేయిస్తాం.

సాక్షి: మహిళా సంక్షేమానికి ఎలాంటి ప్రాధాన్యం ఇస్తారు?

ఎమ్మెల్యే: మహిళలు స్వయంశక్తితో ఆర్థికస్వాలంబన సాధించేలా ప్రోత్సహిస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటికే అమలులోకి తీసుకొస్తున్నాం. ఉచితబస్సు ప్రయాణం, రాజీవ్‌ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నాం.

ప్రత్యామ్నాయ పంటలు పండించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే ప్రత్యామ్నాయ పంటలు పండించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రైతులకు సూచించారు. సాగు పద్ధతుల్లో మెలకువలు పాటించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలని కోరారు. రాఘవాపూర్‌లోని రైతువేదికలో బుధవారం రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వంట నూనెలను ఇక్కడే ఆయిల్‌పామ్ సాగుచేస్తూ అందుబాటులోకి తీసుకుని రావొచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పండ్లు, పప్పు దినుసులు పండించాలని, తద్వారా మంచి ఆదాయం సమకూరుతుందని చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని, లేదంటే భూసారం కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నారు. ఆధునిక పద్ధతులతో సాగుచేస్తున్న రైతులు ఎర్రం మల్లారెడ్డి, ఎరబాటి వెంకటేశ్వర్ రావును కలెక్టర్ సత్కరించారు. ఈసందర్భంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పోస్టర్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఏవో ఆదిరెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, వ్యవసాయాధికారి అలివేణి ఆవిష్కరించారు. ఏఈవోలు స్పందన, శిరీష, సువర్ణ, శ్వేత, కల్పన పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. రాఘవాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కొనుగోళ్ల తీరుపై ఆరా తీశారు. రైతులకు చెల్లింపులు త్వరగా చేయాలని సూచించారు. ఆయన వెంట మార్కెటింగ్ శాఖ అధికారులు ఉన్నారు.







రసవత్తరంగా మైన్స్ రెస్క్యూ పోటీలు



52వ ఆల్ ఇండియా మైన్స్ రెస్క్యూ పోటీలు బుధవారం మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో రసవత్తరంగా సాగాయి. మూడోరోజు డీఎంఎస్, డీడీఎంఎస్ నేతృత్వంలో ఆద్యంతం ఆసక్తిగా జరిగాయి. ఆపదలో ఉన్నకార్మికుడిని కాపాడడం కోసం తమకు ఎదురయ్యే అవాంతరాలను నిర్ణీత సమయంలో అధిగమిస్తూ నిర్దేశిత లక్ష్యం చేరుకున్నారు రెస్క్యూ సభ్యులు. పురుషులతో సమానంగా మహిళా సభ్యులు తమ ప్రతిభ కనబర్చారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ, రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, రెస్క్యూ జీఎం ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. – గోదావరిఖని

ప్రజల ఆశీర్వాదమే బలం

- ఆదర్శ జిల్లాగా ఉమ్మడి కరీంనగర్
- దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ఆశీస్సులే ఇంతటివాడిని చేశాయి
- పొన్నం అంటేనే కాంగ్రెస్
- ఎస్ఆర్ఆర్ నుంచే రాజకీయ జీవితం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



విజయభేరి సభకు హాజరైన ప్రజలు



కరీంనగర్ విజయభేరి సభలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలోనే ఉమ్మడి కరీంనగర్‌ను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించింది ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల అని, రాజకీయ ఉద్ధండులు వైఎస్ రాజశేఖరరెడ్డి, జువ్వాడి చొక్కారావు, ఎమ్మెస్సార్, జి.వెంకటస్వామి, జైపాల్‌రెడ్డి నుంచి అక్షరాలు నేర్చుకున్నానని చెప్పారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి బుధవారం పొన్నం ప్రభాకర్ కరీంనగర్ వచ్చారు. నగరంలోని ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన విజయభేరి సభలో ఆయన మాట్లాడుతూ సహచర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల సహకారంతో ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళుతామన్నారు. గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, తమది చేతల ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం మారిందని, అధికారులు కూడా వ్యవస్థను మార్చుకోవాలని సూచించారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనని, తాను కరీంనగర్ బిడ్డనన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యక్షుడిగా తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, ఎన్ఎస్‌యూఐ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేశానన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో కరీంనగర్ ఎంపీ అయ్యానన్నారు. తన రాజకీయ గురువు జువ్వాడి చొక్కారావు 1973లో రవాణా శాఖ మంత్రి అయితే, చొక్కారావు శిష్యుడినైన తాను 2023లో రవాణాశాఖ మంత్రి అయ్యానన్నారు. తాను 1987లో రాజకీయ జీవితం ప్రారంభించానని, ఈ 36 ఏళ్లలో ఎక్కడా అవినీతికి తావులేదని, ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. కొంతమంది చేతగాక పార్టీలు మారినోళ్లు తనను విమర్శిస్తే, భగవంతుడు ఒక్క అవకాశం ఇస్తాడని చెప్పానంటూ గుర్తు చేసుకున్నారు. తాను పార్టీ మారలేదని కాంగ్రెస్ అంటే పొన్నం, పొన్నం అంటేనే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. తనకు ప్రజల ఆశీర్వాదమే టానిక్ అని, కేసీఆర్ వాడే టానిక్ కాదంటూ చమత్కరించారు. ఎంపీగా తాను పార్లమెంట్‌లో తెలంగాణ కోసం కొట్లాడి, మా ఎంపీ పొన్నం అని ప్రజలు గర్వంగా చెప్పుకునేలా చేశానన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ కోసం ఉద్యమించి ప్రజల ఆశలు నెరవేర్చిన నేత పొన్నం ప్రభాకర్ అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో నాలుగు స్థానాలు గెలిపించుకున్నానని తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నియంతృత్వ ప్రభుత్వం కూలిపోయి, ప్రజాప్రభుత్వం వచ్చిందన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు పురుమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మెనేని రోహిత్‌రావు, మంజులారెడ్డి, కటకం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దారిపొడవునా నీరాజనం

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్, అనుబంధ విభాగాలు, పొన్నం అభిమానులు, కుల, బీసీ సంఘాలు ఘనస్వాగతం పలికాయి. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంతో కలిసి ఓపెన్‌టాప్ వాహనంలో నగరానికి చేరుకున్న పొన్నం ప్రభాకర్‌కు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన స్వాగత వేదికల వద్ద పూలవర్షంతో నీరాజనం పట్టారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి కోతిరాంపూర్, కమాన్‌చౌరస్తా, సిక్‌వాడీ, శ్రీపాదచౌక్ మీదుగా ఇందిరాచౌక్ వరకు అడుగడుగునా స్వాగతం పలికారు. కోలాటాలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలతో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గొల్లకురుమలు గొంగడితో సత్కరించారు. సిక్‌లు కరవాలం బహుకరించారు. ఆర్టీసీ కార్మికులు గజమాలతో సన్మానించారు. ఇందిరాచౌక్ వద్ద విజయభేరి సభ ముగిసిన తరువాత పొన్నం ప్రభాకర్ ర్యాలీగా డీసీసీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నాయకులతో సమావేశమయ్యారు. నాయకులు కట్ల సతీశ్, కొడూరి రవీందర్‌గౌడ్, మునిగంటి అనిల్, దన్ను సింగ్, ఖమర్, సిరాజొద్దీన్, మొహమ్మద్ అమీర్, బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసెంబ్లీని పరిశీలించిన ఎమ్మెల్యే ఎంఎస్ ఠాకూర్



సీఎం రేవంత్‌రెడ్డి వెంట ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/రామగుండం: రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి అసెంబ్లీలో పర్యటించారు. అసెంబ్లీ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు.

నిషేధిత వస్తువులు తరలించొద్దు



తనిఖీ చేస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ సురేశ్‌గౌడ్

రామగుండం: రైళ్లలో నిషేధిత కిరోసిన్, పెట్రోల్, గ్యాస్‌తోపాటు నల్లబెల్లం, కలప, మద్యం అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సురేశ్‌గౌడ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. పెద్దంపేట రైల్వేస్టేషన్‌లోనూ సోదాలు చేశారు. నిబంధనలు అతిక్రమించినందుకు ఈ ఏడాదిలో 2,270 కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన రామగుండం ఎమ్మెల్యే



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తకు సన్మానం



సుధాకర్ పటేల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండం: అంతర్గాం మండలంలోని ఆకెనపల్లికి చెందిన గాదె సుధాకర్ పటేల్ అనే కాంగ్రెస్ కార్యకర్త ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేశారు. దీంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బుధవారం ఆయనను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, వారి సేవలను వినియోగించుకుంటూ సన్మానిస్తామని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

గోదావరిఖనిటౌన్: ముంబాయికి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్ ఆర్గనైజేషన్ ఫర్ నేషనల్ లెవల్ ఆర్ట్ కాంపిటీషన్ ఆధ్వర్యంలో గత నెల 14న గోదావరిఖని సెక్రెట్ హార్ట్ పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పాఠశాలకే చెందిన 59 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫొటోగ్రఫీ, కలరింగ్, టాటూ మేకింగ్, గ్రీటింగ్ కార్డ్ మేకింగ్ తదితర కేటగిరీల్లో వీరు అర్హత సాధించారు. మొదటి బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటీ, మిగతా విద్యార్థులు బంగారు, వెండి పతకాలతోపాటు సర్టిఫికెట్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ లవ్‌లీ జాకబ్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ప్రైమరీ ఇన్‌చార్జి ఇన్నమ్మ బుధవారం అభినందించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన తోట రవి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రవి–సరోజన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అతను మద్యానికి బానిస కావడంతో సరోజన పిల్లలను తీసుకొని, తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రవి మంగళవారం రాత్రి ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

‘బెల్ట్’ తీస్తారో..లేదో?

- ఎన్నికల వేళ మద్యం అమ్మకాలకు బ్రేక్
- కోడ్ ఎత్తివేయగానే మళ్లీ జోరుగా విక్రయాలు
- పల్లెపల్లెనా లెక్కకు మించి బెల్ట్‌షాపులు



పెద్దపల్లిరూరల్: ఊరూరా, వాడవాడలా విచ్చలవిడిగా ఏర్పాటైన బెల్ట్‌షాపులు బార్ అండ్ రెస్టారెంట్లకు ధీటుగా మద్యం విక్రయాలు సాగిస్తున్నాయి. జిల్లాలో బెల్ట్‌దుకాణం లేని ఊరు లేదు. ఇంకా గమ్మత్తేంటంటే.. పెద్దపల్లి మండలం నిట్టూరులో 15 ఏళ్ల క్రితం స్వశక్తి మహిళా సంఘాల చొరవతో బెల్ట్‌షాపులు ధ్వంసం చేశారు. అప్పట్నుంచి మద్య నిషేధం అమలు చేసుకున్నారు. కానీ పొరుగునే ఉన్న అన్నిఊళ్లలో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు.. మద్య నిషేధం ఎత్తేయడంతో నిట్టూరులోనూ వాడవాడలా రెండు, మూడు బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. ఒక్కో ఊరులో దాదాపు 20 నుంచి 30దాకా బెల్ట్‌షాపులు ఉన్నాయంటే నమ్మశక్యం కావడంలేదు.

బార్లను తలపించేలా..

- పట్టణ శివారులోని చిన్నహోటళ్లను ఏర్పాటు చేసుకుని మద్యం అమ్మకాలతో పాటు సిట్టింగులు ఏర్పాటు చేసి బార్ అండ్ రెస్టారెంట్లను తలపించేలా అమ్మకాలు సాగిస్తున్నారు.
- అప్పటికప్పుడే ఆర్డర్లు తీసుకుని చికెన్, మటన్ లాంటి నాన్‌వెజ్ వండించి అందిస్తున్నారు.
- దీంతో మద్యం ప్రియులు.. ముఖ్యంగా యువత వీటివైపు ఆకర్షితులవుతున్నారు.
- కొన్నిప్రాంతాల్లో తాత్కాలికంగా షెడ్లువేసి సిట్టింగులు నిర్వహిస్తున్నారు.
- రాజీవ్ రహదారి వెంట ఉన్న పట్టణాలు, గ్రామాలు, మంథని మార్గంలో ఇలాంటి హోటళ్లు దర్శనమిస్తున్నాయి.
- పెద్దపల్లి పట్టణంలోని ఓ గుడికి సమీపంలో ఇలాంటి హోటల్ ఏర్పాటు చేయగా అమ్మకాలు బార్ అండ్ రెస్టారెంట్‌కు ధీటుగా సాగుతున్నాయని నిర్వాహకులే చెప్పడం గమనార్హం.

కోడ్ ఎత్తివేయగానే..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో అధికారులు బెల్ట్‌దుకాణాలను మూయించారు. జిల్లావ్యాప్తంగా 311 బెల్ట్ దుకాణాలపై కేసులు నమోదు చేసి 223 మందిని అరెస్టు చేశారు. 25 వాహనాలను సీజ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన బెల్ట్‌దుకాణ నిర్వహణదారులను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. గుడుంబా తయారీ, మద్యం అక్రమ రవాణాదారులను తనిఖీల సందర్భంగా పట్టుకున్నారు. 712 కేసులు నమోదు చేసి 98 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే మళ్లీ పల్లెలన్నీ బెల్ట్‌షాపులతో ఎప్పటిలాగే అమ్మకాలు సాగిస్తున్నాయి. ఊళ్లలో విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలపై కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

మద్యం, గుడుంబా అక్రమ రవాణా, అమ్మకాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ముందస్తుగా పలువురిని బైండోవర్ చేశాం. మద్యం అక్రమ అమ్మకాలపై ఫిర్యాదులు వస్తే సత్వరమే స్పందిస్తాం.

– శ్రీనివాస్, సీఐ, పెద్దపల్లి

సాగు రాయితీలు వినియోగించుకోండి

రామగుండం: ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటలు, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసే రైతులకు 2023–24వ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత సాగుకు పలు రకాల రాయితీలను అందజేయనున్నట్లు ఉద్యానవనశాఖ అధికారి జక్కుల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాకు మామిడి, అరటి మూడు హెక్టార్ల చొప్పున, బొప్పాయి 1.70 హెక్టార్లు, జామ 1.60 హెక్టార్లు, డ్రాగన్ ఫ్రూట్ ఒక హెక్టార్‌లో 50 శాతం రాయితీ అందించనున్నట్లు పేర్కొన్నారు. అరటి తోటలకు రూ.30,799. హెక్టారుకు 3,086 మొక్కలు నాటుకోవాలి. బొప్పాయి తోటలకు రూ.22,500. హెక్టారుకు 3,086 మొక్కలు నాటుకోవాలి. మామిడి తోటలకు రూ.9,800. హెక్టారుకు రూ.400 మొక్కలు నాటాలి. జామ తోటలకు రూ.9,800. హెక్టారుకు 1,111 మొక్కలు నాటాలి.



మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన పంట

మల్చింగ్: కూరగాయలు, పండ్ల తోటల్లో కలుపు నివారణకు, అధిక దిగుబడి పొందేందుకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు. జిల్లాలో 10 హెక్టార్లలో సాగుకు మంజూరు చేస్తారు.

కూరగాయల నారు: సీవోఈ, ములుగు హైటెక్ నర్సరీ ద్వారా టమాట, వంగ, మిరప నారును 90 శాతం రాయితీపై ఇవ్వనున్నారు. జిల్లా పరిధిలో ఐదు హెక్టార్లలో సాగుకు మంజూరు చేస్తారు.

ఆయిల్‌పాం సాగు : జిల్లా పరిధిలో 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుకు రాయితీ ఇవ్వనున్నారు. ఒక ఆయిల్‌పాం మొక్కకు రూ.193 రాయితీ కలదు. రైతు వాటా రూ.20. నాలుగేళ్లకు రూ.16,800, ఏటా మొక్కలకు ఎరువులతోపాటు అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.4,200 రాయితీ ఇస్తారు. ఆసక్తి గల రైతులు ధ్రువపత్రాలతో జిల్లా ఉద్యానవనశాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ఓటరుగా నమోదు చేసుకోండి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు శశిభూషణ్, సంపత్‌రావు, శారద, తిరుపతి, రాజ్‌కుమార్, రవీందర్‌తోపాటు ఎలక్షన్ డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

కుందనపల్లి కేజీబీవీ సందర్శన



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీసీఎస్‌వో, సీఎస్‌ఐ

రామగుండం: కుందనపల్లి శివారులోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఎ.ప్రేమ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ పెంచాల మల్లికార్జున్‌రావు బుధవారం రాత్రి సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ బుధవారం ప్రభుత్వ విద్యాసంస్థలకు వెళ్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అటెండెన్స్ తదితర రిజిస్టర్లను పరిశీలించారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించండి

- ఏపీఏ, ఆర్జీ–3 జీఎంలు వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ రోజు కార్మికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఏ, ఆర్జీ–3 జీఎంలు కె.వెంకటేశ్వర్లు, ఎస్.సుధాకర్‌రావు ఆదేశించారు. బుధవారం స్థానిక జీఎం కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు వివిధ గనుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.నాగేశ్వర్‌రావు, కె.రాజేందర్, ఐఈడీ, సివిల్ డీజీఎంలు చంద్రశేఖర్, పద్మరాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎంలు వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు

అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన క్రైస్తవులు, సంస్థలు అవార్డుల కోసం ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మెహరాజ్ మహమ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్య, వైద్య, సాహిత్య, కళ, క్రీడా తదితర రంగాల్లో సేవలందించిన క్రైస్తవ సంస్థలు, వ్యక్తులను ప్రభుత్వం సత్కరిస్తుందన్నారు. పూర్తి వివరాలకు 08728–222266, 040–23391067 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువకుడి బలవన్మరణం



సందీప్ (ఫైల్)

జ్యోతినగర్: అనారోగ్య కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌కు చెందిన రామంచ సందీప్(27) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి వచ్చిన కుటుంబసభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాజయ్య ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. కుటుంబసభ్యులు సందీప్ నేత్రాలను దానం చేయగా ఐ బ్యాంకు టెక్నీషియన్ బాలు సేకరించి, హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు.

పొలంలోనే కుప్పకూలిన వ్యవసాయ కూలీ

- గుండెపోటుతో మృతి



రాయపోశం మృతదేహం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మొట్లపల్లికి చెందిన జిలుకర రాయపోశం (57) అనే వ్యవసాయ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాయపోశం మొట్లపల్లికే చెందిన ఓ రైతు పొలంలో బుధవారం ఒడ్లు పెట్టేందుకు వెళ్లాడు. పారతో ఒడ్లు పెడుతుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి, చూసేసరికి మృతిచెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఏడాదిన్నర క్రితం చనిపోయింది. ఇద్దరు కుమారులు రమేశ్, బాలకృష్ణ ఉన్నారు. స్థానికులతో కలివిడిగా ఉండే రాయపోశం మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

యువకుడి ఆత్మహత్యాయత్నం



గాయపడిన సురేశ్

రామగిరి: మండలంలోని పన్నూర్ పంచాయతీ పరిధి శివరాంనగర్‌లో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. నాగెపల్లికి చెందిన మాటేటి సురేశ్ బుధవారం శివరాంనగర్‌లోని అత్తగారింటికి వచ్చాడు. తన భార్య కాపురానికి రావడం లేదని గొడవ పడి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు మంటలు ఆర్పివేసి, గాయపడిన సురేశ్‌ను పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ నియామకాలపై అభ్యంతరాలుంటే చెప్పండి

పెద్దపల్లిరూరల్: రామగుండం మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి అర్హులైన, తిరస్కరించిన అభ్యర్థుల జాబితాను పెద్దపల్లిలోని వారధి సొసైటీలో ప్రదర్శించామని కరీంనగర్ వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈ నెల 15 సాయంత్రం 5 గంటల్లోగా ఆధారాలతో తెలపాలన్నారు. ఆ తర్వాత ఎలాంటి సవరణలు చేయలేమని పేర్కొన్నారు.

స్థానికులకే ఉపాధి అవకాశాలు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించేలా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచనలతో ముందుకు సాగుతామని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో స్థానిక ఉద్యోగులపై ఇతర రాష్ట్రాల అధికారులు, కాంట్రాక్టు సూపర్‌వైజర్లు పెత్తనం చెలాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇకనుంచి వారు తమ పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

బొగ్గుబాయి

సింగరేణి ఆవిర్భావ ఏర్పాట్లపై సమీక్ష





మాట్లాడుతున్న జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్

రామగిరి: ఆర్జీ–3 జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న స్థానిక రాణీ రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.నాగేశ్వర్‌రావు, కె.రాజేందర్, ఐఈడీ, సివిల్ డీజీఎంలు చంద్రశేఖర్, పద్మరాజు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, డీవైపీఎంలు గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఆర్జీ–1 ఏరియాలో ఘనంగా నిర్వహించాలని జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. బుధవారం అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు శాఖల వారీగా కేటాయించిన పనులను సమన్వయంతో గడువులోగా పూర్తి చేయాలన్నారు. అధికారులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ, బానోతు సైదులు, ఎం.రామ్మూర్తి, ధనలక్ష్మి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ కార్మిక సంఘాలను ఆదరించాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాబోయే సింగరేణి ఎన్నికల్లో విప్లవ కార్మిక సంఘాల ఐక్య కూటమిని గెలిపించాలని నాయకులు సాధినేని వెంకటేశ్వర్‌రావు, టి.శ్రీనివాస్ కోరారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జేబీసీసీఐ, పార్టీల అనుబంధ సంఘాలు కార్మికులకు న్యాయం చేయలేవన్నారు. నిర్బంధాల మధ్యే గతంలో అనేక పోరాటాలు చేశామని తెలిపారు. మూడు సంఘాలు కలిసికట్టుగా పోటీలో ఉన్నామని, ప్రశ్నించే గొంతును నిలబెట్టడం, బొగ్గు బావులు, కార్మికుల హక్కులను రక్షించడం తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఇక్కడి నిధులను సిరిసిల్ల, హైదరాబాద్‌లలో సీసీ కెమెరాలకు వెచ్చించారని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోరాడే విప్లవ కార్మిక సంఘాలను ఆదరించాలని కోరారు. నాయకులు విశ్వనాథ్, పోచమల్లు, నరేశ్, రాములు, సీతారామయ్య పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం వల్లే సింగరేణికి నష్టం

- ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

రామగిరి: సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి ఆరోపించారు. ఫలితంగా లాభాల్లో ఉన్న సంస్థ నష్టపోయిందని అన్నారు. బుధవారం ఏపీఏ గనిలో ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. టీబీజీకేఎస్ పూర్తిగా యాజమాన్యం తొత్తుగా మారి, కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఏఐటీయూసీ గతంలో తప్పుడు ఒప్పందాల మీద సంతకాలు చేసిందని, ఆ సంఘంతో ఎలాంటి పొత్తు లేదన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో గడియారం గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని కోరారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనికి చెందిన 75 మంది కార్మికులు బుధవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. వారికి సెంట్రల్ కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి కండువాలు కప్పి, ఆహ్వానించారు. సంఘంలో చేరిన వారిలో టీబీజీకేఎస్ మైనింగ్ కమిటీ మెంబర్ లేగల రంగయ్య, సీఐటీయూ నాయకులు రొడ్డ రాజయ్య, వెంకటసాయి తదితరులున్నారు. ఏపీఏ ఫిట్ సెక్రటరీ కొంరయ్య, బ్రాంచి కార్యదర్శులు శ్రీనివాసరావు, సమ్మయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నిజం చేస్తాం

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సొంతింటి కల నిజం చేస్తామని ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం జీడీకే–2ఏ, ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ రద్దు చేయిస్తామని, కొత్త బొగ్గు గనులను ప్రారంభించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో గడియారం గుర్తుపై ఓటువేసి, గెలిపించాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని వర్క్ షాప్‌లు ప్రైవేటుపరం కావడానికి ఏఐటీయూసీ కారణమని ఆరోపించారు. పలువురు కార్మికులు యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. నాయకులు ధర్మపురి, సదానందం, పర్వేష్‌ఉద్దీన్, వికాస్ కుమార్‌యాదవ్, దేవులపల్లి రాజేందర్, ఆరెపల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న సత్తయ్య

రామగిరి: నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేసి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేస్తామని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కార్పొరేట్ విద్య, వైద్యం, సంక్షేమం అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న బీఎంఎస్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ నెల 27న జరగనున్న సింగరేణి ఎన్నికల్లో కాగడ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్‌గౌడ్, కేంద్ర ఉపాధ్యక్షుడు వై.సారంగపాణి, కేంద్ర కమిటీ సభ్యులు పోతరాజు, బ్రాంచి కార్యదర్శి మామిడి స్వామి, ఫిట్ కార్యదర్శి గోగుల విద్యాసాగర్, మర్రి సంతోష్, ఎండీ.జానీ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కోసం 2 గుంటల భూమి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తామని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బుధవారం ఆర్జీ–1 సీఎస్పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులకు ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్ కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. సొంతింటి కోసం 2 గుంటల భూమి, రూ.50 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు అమలయ్యేలా చూస్తామన్నారు. నాయకులు మాదాసు రవీందర్, ఆకుల హరీశ్, సాయవేణి సతీశ్, పల్లె రవీందర్, పెంచాల వెంకటస్వామి, తాట్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వడ్డీ లేని రుణం ఇప్పిస్తాం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్



కండువా కప్పుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని: కార్మికుల సొంతింటి పథకం అమలు చేయించి, రూ.20 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం వకీల్‌పల్లిగనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రాణత్యాగాలు చేసి, ఎన్నో హక్కులు సాధించామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్మికులకు సింగరేణి లాభాల్లో వాటా ఇప్పించిన ఘనత తమ యూనియన్‌కే దక్కుతుందన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపరుస్తామని, రాజకీయ జోక్యం లేకుండా ఆర్థిక దోపిడీని అరికడతామని పేర్కొన్నారు. సంస్థకు రావాల్సిన సుమారు రూ.29 వేల కోట్ల బకాయిలను ఇప్పించి, ఆ మొత్తాన్ని కార్మిక సంక్షేమానికి ఖర్చు చేయిస్తామని తెలిపారు. 11 ఏళ్లుగా అసమర్థ యూనియన్ ఉండటం వల్ల కంపెనీలో అనేక సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. నాయకులు రాజారత్నం, రవీందర్, అన్నారావు, సంపత్, రాజు, భార్గవ్, అంజి, బుర్ర తిరుపతి, శ్యాంసన్, గంధం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వృత్తి శిక్షణ ప్రారంభం

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లోని వివిధ విభాగాల్లో ఉచిత వృత్తి శిక్షణకు దరఖాస్తు చేసుకున్న మహిళలకు గురువారం శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఆర్జీ–3 పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సెంటినరీకాలనీ సమితి కార్యాలయంలో శిక్షణనిస్తామన్నారు.